లేఖ నెం : 222 / రిపోర్టింగు 2010, తేదీ : 17-03-2010

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, గత పదిహేను సంవత్సరాల నుంచి నేను చాలా నిశితంగా విద్యుత్తు రంగాన్ని పరిశీలిస్తున్నాను. ఈ రాష్ట్రం ఆర్థికంగా కుప్పకూలడానికి విద్యుత్తు రంగం కారణం అవుతుంది. 15 ఏళ్లుగా మనం చాలా దారుణమైన విధానాల్ని అనుసరించాను. ఆ నేపథ్యంలో మొట్టమొదటి క్లారిఫికేషన్, ఒకేసారి 1342 మెగా వాట్లు థర్మల్ పవర్ జనరేషన్ ఆగిపోయింది. అలాగే 40 శాతం హైడ్రో పవర్ ఆగిపోయింది. ఈ సంవత్సరం ఎప్పుడు లేనంతగా వరదలు వచ్చి రిజర్వాయర్‌లు నిండి కొంచెం వర్షం ఆలస్యం అయినా కూడా కళకళలాడుతున్నప్పుడు కూడా 40 శాతం విద్యుత్తు ఉత్పత్తి హైడ్రో పవర్ రంగంలో తగ్గిందంటున్నారు. అలాగే ఒకేసారి 1342 మెగా వాట్లు థర్మల్ పవర్ జనరేషన్ రంగంలో తగ్గిందని అంటున్నారు. ఇది కాకాతాళీయమా, దీర్ఘకాలిక సమస్య ఏమన్నా ఉందా, ఒకసారి మంత్రి గారు క్లారిఫై చేయాలి. 2. నాగార్జున సాగర్, శ్రీ శైలం రిజర్వాయర్ దగ్గర హైడ్రో పవర్ స్టేషన్స్ దగ్గర వరదలు వచ్చినప్పుడల్లా మునిగిపోతున్నాయి. దీర్ఘకాలికంగా ఎంత వరద వచ్చిన కూడా ఫ్లడ్ ఫ్లో(వరద ప్రవాహం) ఎంత ఉన్న కూడా అది మునగకుండా, కొన్ని వందల కోట్ల రూపాయల నష్టం లేకుండా, కొన్ని నెలల పాటు విద్యుత్తు ఉత్పత్తి ఆగకుండా దీర్ఘకాలికంగా ప్రణాళిక చేపట్టారా? దాని కోసం నిధులు ఏమైనా కేటాయించారా? 3. ఆర్థిక మంత్రిగా ముఖ్యమంత్రి గారే విద్యుత్తు మంత్రి కూడా, ఆయన బడ్జెట్‌లో 4,500 కోట్ల రూపాయలు వ్యవసాయ విద్యుత్తు సబ్సిడీగా చూపెట్టారు. వాస్తవానికి గత సంవత్సరమే 6,800 కోట్ల రూపాలయల పైచిలుకు చూపెట్టారు. ఈ సంత్సరం ఈ పరిస్థితి ఉంటే ఇంకా పెరిగే అవకాశం ఉన్నది. ఆ గణాంకాలు realistic గా లేవు. రోజుకు 20 కోట్ల రూపాయల సబ్సిడీ ప్రస్తుతం ఉండే అవకాశం ఉన్నది. అలాంటి పరిస్థితులలో మీరు పంపిణీని బాగు చేయకుండా, వృధాను అరికట్టకుండా నూటికి నూరు శాతం డిస్ట్రిబ్యూటర్స్ ట్రాన్స్ఫార్మర్లకు మీటర్లు పెట్టకుండా, డిస్ట్రిబ్యూషన్‌ను ఇంప్రూవ్ చేయకుండా, విద్యుతు వ్యవస్థను బాగు చేయలేరు, విద్యుత్తును అందించలేరు. దానికి పథకాలు చేపట్టారా? 4. పి.పి.ఏలు (విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు) ఉన్నా కూడా Independent Power Projects కు 25 శాతం మార్కెట్‌లో అమ్ముకునే ఏర్పాట్లు చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో విద్యుత్తు కొరతను దృష్టిలో ఉంచుకొని దానిని తాత్కాలికంగానో, దీర్ఘకాలికంగానో సవరించే ఏర్పాట్లు ఏమైనా చేస్తారా? దానిలో భాగంగానే విశాఖపట్టణంలో ఒక ప్రాజెక్టుకు నూటికి నూరుపాళ్లు కూడా మార్కెట్‌లో అమ్ముకునే ఏర్పాట్లు చేస్తున్నారని వార్తలు వచ్చాయి. ఈ రాష్ట్రంలో విద్యుత్తు కొరత నేపథ్యంలో ఈ పి.పి.ఏ వారితో కూడా ఏర్పాటు చేసుకొని మనకు భారత ప్రభుత్వంతో వచ్చినటువంటి ఎన్‌టిపిసి ప్రాజెక్టుతో సమానంగా ట్యారిఫ్‌తో మనం కొనుగోలు చేసి ఏర్పాట్లు చేస్తారా? 5. మనకు మెట్ట ప్రాంతంలో భూగర్భ జలం లేనప్పుడు కూడా ఏప్పుడు అయితే ఉచిత విద్యుత్తు ఇస్తున్నారో అక్కడ బాగా నీటిని వినియోగించేటటువంటి వరి, చెరుకు పంటలను పండిస్తున్నారు. వాటిని ఆరికటట్టకపోతే అక్కడ భూగర్భ జలం నాశనం అయిపోతుంది, ఇటు విద్యుత్తు రంగం నాశనం అయిపోతుంది. దాని కోసం ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా? 6. ఈ వేళ సభలో ఓట్ల కోసం మనం అంతా కూడా మనస్సాక్షిని చంపుకొని మాట్లాడుతున్నాము. అక్కడ వున్న అధికారులను చూస్తే నాకు చాలా బాధ వేస్తున్నది. రసూల్‌ఖాన్ గారు చెప్పినట్లుగా, కాళ్లు చేతులు కట్టిపారేసి ఒలింపిక్స్‌లో పరుగెత్తమని అంటున్నాము. కాని, విద్యుత్తు ఉచితంగా ఇవ్వాలి. మీటర్లు ఉండకూడదు, ట్యారిఫ్‌లు పెట్టకూడదు. 24 గంటలు విద్యుత్తు గ్రామాలకు రావాలి. కాని, కొరత లేకుండా వుండాలి. యూనిట్ 13 రూపాయలతో కొనాలి. అదే సమయంలో బడ్జెటులో లోటు ఉండకూడదు. అప్పులు ఉండకూడదు. ఇవన్ని అయ్యాక ప్రతి రంగానికి రెట్టింపుగా కేటాయించాలి. ప్రపంచంలో దేవుడు కూడా ఇవన్ని చేయించలేడు. ఈ రోజు గుజరాత్ రాష్ట్రాన్ని చూడండి, 24 గంటలు గ్రామాలకు విద్యుత్తు ఇస్తున్నారు. గుజరాత్‌లో ఆంధ్రప్రదేశ్ కంటే వర్షాపాతంలో సగటున తక్కువ. వారు 8 వందల అడుగుల నుంచి నీళ్లు తీస్తున్నా కూడా హార్స్‌పవర్‌కు 850 రూపాయలు అక్కడ వసూలు చేస్తున్నారు లేదా మీటరు పెట్టినట్లైతే యూనిట్‌కు 50 పైసలు వసూలు చేస్తున్నారు. అయినా కూడా వ్యవసాయం లాభసాటిగా రైతులు అక్కడ చేస్తున్నారు. ఎంత కాలం మనం ఓట్ల వేటలో భవిష్యత్తును సమాధి చేస్తాం? ఎంత కాలం మనం ఈ రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలో ఉంచుదాం? గ్రామాలలో 24 గంటలు విద్యుత్తు కావాలి, వ్యవసాయేతరంగా పరిశ్రమలు కావాలి, ఉపాధి కావాలి, అక్కడ నుంచి వలసలను అరికట్టాలి.

కాని, తాత్కాలిక ఓట్ల వేటలో మనం పార్టీలు ఒకరితో ఒకరూ పోటీ పడి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, విద్యుత్తు పరిస్థితిని నాశనం చేస్తే వ్యవసాయం నాశనం అవుతుంది. రాష్ట్ర భవిష్య.

00త్తు నాశనం అవుతుంది. దయచేసి ఇప్పటి నుంచైనా గుజరాత్‌లో చేసినట్లుగా మీటరింగ్ పెట్టి ఎంతో కొంత ఛార్జ్ చేసినట్లైతే వృధా చేయకుండా అరికట్టి ఈ రాష్ట్ర భవిష్యత్తును కాపాడే పరిస్థితి ఉంటుంది. దాని కోసం అది వాస్తవం అని తెలిసినా కూడా మంత్రి వర్యులు గానీ, ప్రభుత్వం గానీ మాట మెదపలేక పోతున్నారు. అందుకు తీవ్రమైన నిరసన వ్యక్తం చేస్తూ ఈ రాష్ట్రంలో ప్రజలు, ముఖ్యంగా యువత, రైతులు వారి భవిష్యత్తును గమనిస్తారని ఆశిస్తూ నేను కూర్చుంటున్నాను.

**డా॥ జయప్రకాష్ నారాయణ :** అధ్యక్షా, నేను ఒక విషయమే మనవి చేస్తాను. పక్షపాతాలకు అతీతంగా రాష్ట్ర భవిష్యత్తును రక్షించుకోవాలంటే విద్యుత్‌కు మీటర్లు ఉండాలి. మీరు కావాలంటే ఉచితంగానే ఇవ్వండి, లేదా యూనిట్‌కు పది పైసలు పెట్టండి. కానీ ఓట్ల కోసం రాష్ట్ర భవిష్యత్తును బలిపెడుతున్నామనే మాట కఠోరమైన వాస్తవం. ఎన్ని సార్లు చెప్పిన కూడా విననట్లుగా నటిస్తున్నారు. తెలియకపోతే చెప్పవచ్చు కానీ పూర్తిగా వాస్తవాలు తెలుసు. నూటికి నూరు పాళ్లు తెలుసు. అక్కడ కూర్చున్నవారికి తెలుసు. ఇక్కడ కూర్చుని బయటికి వెళ్ళినవారికి తెలుసు. మన అధికారం కోసం రాష్ట్రాన్ని పాతిపెట్టడానికి సిద్ధపడుతున్నాం. రాష్ట్ర యువత భవిష్యత్తు నాశనం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. ఇరవై నాలుగు గంటలూ గ్రామాలకు విద్యుత్ అందించి అక్కడ పారిశ్రామికీకరణ పెంచినట్లయితే రాష్ట్రం బాగుపడుతుంది. గుజరాత్‌లో చేసిన రీతిని మీటర్లు పెట్టి ఎంతో కొంత ఛార్జ్ చేసినట్లయితే విద్యుత్ వృధా చేయకుండా అరికట్టవచ్చు.